క్లుప్తంగా

పక్కా గృహం మంజూరుకు కృషి చేస్తాం



అమృతలూరు (కొల్లూరు) : అగ్ని ప్రమాదంలో దగ్ధమైన గృహం స్థానంలో పక్కా గృహం మంజూరుకు కృషి చేస్తామని ఎంపీడీఓ మారుతి శేషమాంబ అన్నారు. మండలంలోని ఇంటూరులో ఇటీవల దగ్ధమైన తాళ్లపల్లి సీతారామయ్య గృహాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్ని ప్రమాదం కారణంగా గృహం కోల్పోయి నిర్వాసితులైన బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందించడంతోపాటు, పక్కా గృహం మంజూరుకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

రామాయణం భారతీయులందరికీ ఆదర్శం



నగరం: రామాయణం భారతీయులందరికీ ఆదర్శమని సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర్రావు చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో మండలంలోని పెద్దవరం గొడపాలెం రామ మందిరంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీరాముని జీవితం భారతీయులకు ఆదర్శమని అందుకే గ్రామగ్రామాన రామాలయాలు నిర్మించుకుని సీతారామ కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలుత గ్రామ పురవీధులలో గోవింద నామ సంకీర్తన చేశారు. కార్యక్రమంలో జిల్లా దేవాలయ ప్రముఖ్ సత్యనారయణ, వెంకటేశ్వరావు, సాంబయ్య, మురళీకృష్ణ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు రికార్డులు తనిఖీ



వేమూరు (కొల్లూరు) : కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం లెక్కలు, నగదు చెల్లింపుల వివరాలను తహసీల్దార్ సుశీల పరిశీలించారు. స్థానికంగా ధాన్యం కొనుగోలుకు కేటాయించిన రైస్ మిల్లులో ధాన్యం కొనుగోలు లెక్కలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంకు సంబంధించి లెక్కలు పకడ్బందీగా ఉండాలని ఈ సందర్భంగా ఆమె మిల్లర్లకు సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే ధాన్యాన్ని తప్పనిసరిగా కొనుగోలు చేయాలని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారులందరూ.. ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలోని చిరు వ్యాపారులందరూ వెంటనే ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మారీసుపేటలో బుధవారం తెల్లవారుజామున ఆయన పర్యటించారు. ఆప్రాంతంలో జరిగే పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే వ్యాపారులందరితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

భూ సమస్యలపై అర్జీలను వెంటనే పరిష్కరించాలి

పొన్నూరు: రెవెన్యూ సదస్సులలో సర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ జియావుల్‌హక్ ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 656 స్వీకరించినట్లు, వాటిలో ఇప్పటి వరకు 580 పరిష్కారమయ్యాయని, మిగిలిన 43, సర్వేకు 33 అర్జీలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో డీటీ రాజా రమేష్, సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్లు రామారావు, అహ్మద్ పాల్గొన్నారు.

వైద్యశాలలకు గ్రహణం వీడేనా..?

- వైద్యులు లేక మూతబడిన ఆయుర్వేద, హోమియో వైద్యశాలలు
- సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు
- మరలా ప్రారంభించాలంటున్న పట్టణ వాసులు



ఆయుర్వేద మూలికలు

రేపల్లె రూరల్: ఆయుర్వేద, హోమియో వైద్య సేవ లు పట్టణ ప్రజలకు అందని ద్రాక్షలాగానే మిగిలా యి. వైద్యులు రిటైర్ అయిన తరువాత నూతనంగా వైద్యులను నియమించక పోవటంతో ఆయుర్వేద, హోమియో వైద్యశాలలకు గ్రహణం పట్టింది. అనేక మంది హోమియో, ఆయుర్వేద వైద్య సేవలకు మక్కువ చూపుతారంటే ఆయా వైద్య విధానాలు ఏ విధంగా ఉంటాయో అర్థమవుతుంది. రేపల్లె పట్టణంలోని ఇసుకపల్లిలో ఆయుర్వేద వైద్యశాల, ప్రకాశం ప్రాథమిక పాఠశాల పక్కనే హోమియో వైద్యశాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వారు. ప్రసుత్తం ఆయా వైద్యశాలల్లో పని చేసే వారు లేకపోవటంతో మూతపడ్డాయి. అంతేకాక 10 సంవత్సరాల క్రితం వాటిని పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం అక్కడ వైద్యశాలల ఆనవాళ్లు కూడా లేకపోవడం విశేషం.

తరగని ఆస్తి ఆయుర్వేద వైద్యం

తరాలు మారినా తరగని భారతీయుల ఆస్తి ఆయుర్వేద వైద్యమే. నేటికీ ఆ వైద్యం కొన్ని రాష్ట్రాల్లో ప్రఖ్యాతి గాంచింది. పూర్వం చరకుడు, శుశ్రుతుడు వంటి వైద్యులు ఆయుర్వేద వైద్యంపై పరిశోధనలు జరిపి దిగ్విజయంగా ఆపరేషన్‌లు సైతం నిర్వహించినట్లు చరిత్ర ఆధారాలు ఉన్నాయి. అటువంటి ఆయుర్వేద వైద్యశాల రేపల్లె పట్టణంలో ఉండటం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా భావించే వారు. వైద్యశాల ఇసుకపల్లిలోని ఓ ప్రైవేటు భవంతిలో నిర్వహించబడేది. ఆ భవంతి మరమ్మతులకు గురైనా, మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగా ఉన్నా నాటి వైద్యులు వైద్య సేవలు అందించేవారు. కాలక్రమంలో ఆయుర్వేద వైద్యులు రిటైర్ అవ్వటం, నూతన వైద్యులను నియమించకపోవటంతో వైద్యశాల మూతపడింది. దీంతో పట్టణంలో అరకొర ప్రైవేటు ఆయుర్వేద వైద్యశాలలు ఉన్నా పట్టణ ప్రజలు మాత్రం విజయవాడ, గుంటూరు వంటి పట్టణాలకు వెళుతున్నారు.

హోమియోపతి వైద్యంపై నమ్మకంతోనే

అలోపతి, ఆయుర్వేదం వైద్యంతో పోటీగా హోమియోపతి వైద్యం సైతం పెట్టింది పేరు. పట్టణంలో 1986వ సంవత్సరం నుంచి హోమియోపతి వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయి. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా పట్టణం నడిబొడ్డులోని ఓపెన్ థియేటర్ ప్రాంగణానికి వైద్యశాలను మార్చి సేవలు అందించారు. నిత్యం 60–70 మంది వైద్య సేవలు పొందేవారు. వైద్యశాలలో కనీస వసతులు లేకపోయినా నాటి వైద్యులు వైద్యం అందించే వారు. వర్షం కురిస్తే ఆ ప్రాంతమంతా జలమయమైనా వైద్యులు విధులకు హాజరయ్యేవారు. రోగులు సైతం వర్షపు నీటిలోనే వైద్యశాలకు వెళ్లేవారంటే హోమియోపతి వైద్యంపై వారికున్న నమ్మకమే. అయితే వైద్యులు లేకపోవటంతో వైద్య సేవలు నిలిచిపోయి మందులు నిర్వీర్యమైపోయాయి. దీంతో హోమియోపతి వైద్యం పొందేందుకు పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు విజయవాడ, గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాలోని గుడివాడ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి ఆయుర్వేద, హోమియో వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలతో పాటు ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

వైద్యశాలలను పునఃప్రారంభించాలి



పట్టణంలో ఆయుర్వేద, హోమియో వైద్యశాలలు ప్రజలకు అనేక వైద్య సేవలు అందించేవి. అటువంటి వైద్యశాలలు ఆలనా పాలన లేకపోవటంతో మూతబడటం విచారకరం. ఆయా వైద్యసేవలకై సుదూర ప్రాంతాలకు వెళ్తున్న వారు అనేక మంది ఉన్నారు. ప్రభుత్వం పట్టణంలో ఆయుర్వేద, హోమియో వైద్యశాలలను పునఃప్రారంభించి నిష్ణాతులైన వైద్యులచే పట్టణ ప్రజలకు వైద్య సేవలు అందించాలి.

– సీవీ మోహనరావు, పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి, రేపల్లె

అందుబాటులోకి తేవాలి



మన దేశంలో పుట్టి ఇతర దేశాలకు వ్యాప్తి చెందిన ఆయుర్వేద వైద్య విధానాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అటువంటి వైద్యశాల రేపల్లె పట్టణంలో నిర్వీర్యమైపోవటం దురదృష్టకరం. అదే బాటలో హోమియో వైద్యశాల మూతబడింది. పాలకులు స్పందించి ఆయా వైద్యశాలలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– యడ్లపల్లి కిషోర్‌బాబు, పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్, రేపల్లె

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



ఆయుర్వేద, హోమియో వైద్యశాలలు గతంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడేవి. అనివార్య కారణాలతో అవి పనిచేయటం లేదు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఆయా వైద్య సేవలు అందేలా కృషి చేస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వైద్య శాలలు నెలకొల్పి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

ఓంకార నాదమే త్రిమూర్తి స్వరూపం



ఆధ్యాత్మిక సందేశాన్నిస్తున్న సుమిత్రానంద సరస్వతీ మాతాజీ

రేపల్లె రూరల్: ఓంకార నాదం త్రిమూర్తి స్వరూపంగా చెప్పబడుతుందని ప్రణవ ఆశ్రమ నిర్వాహకులు సుమిత్రానంద సరస్వతీ మాతాజీ చెప్పారు. ఓంకార నాద విశిష్టతపై పట్టణంలోని రింగురోడ్డు సెంటర్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సత్సంగంలో ఆమె మాట్లాడారు. ఓంకారాన్ని గ్రహించిన వారు పరమాత్మతో ఏకం చేసుకోగల శక్తివంతులవుతారన్నారు. ఇదొక ఏకాక్షర మంత్రమని, సృష్టి ఉత్పత్తి ప్రక్రియ ఈ ఓంకార శబ్దంతో జరిగిందని తెలిపారు. అత్యంత శక్తివంతమైన ఓంకార నాద జపంతో మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతులవుతారన్నారు. అటువంటి శక్తివంతమైన నాదాన్ని నిత్యం జపించేందుకు కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎంబీఎల్ నారాయణమూర్తి, కోడే గౌరీశంకర్, పీవీకే సాంబశివరావు, ఎస్ఎస్ నాగేశ్వరరావు, మల్లెల రామచంద్రరావు, నాగలీల, పట్టణ ప్రజలు, ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పింఛను ఇవ్వాలి

డీఎల్‌డీవో విజయలక్ష్మి



మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీవో విజయలక్ష్మి

కర్లపాలెం: ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్లు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి అందజేయాలని డీఎల్‌డీవో సీహెచ్ విజయలక్ష్మి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ప్రభుత్వ సర్వే కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎల్‌డీవో విజయలక్ష్మి మాట్లాడుతూ 1వ తేదీన ఉదయం నుంచే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. పింఛన్ల లబ్ధిదారులను గ్రామ పంచాయతీ కార్యాలయాలకు పిలవటం గానీ, అందరినీ ఒకే చోట సమావేశ పరిచి ఇవ్వటం గానీ చేయరాదని తెలిపారు. హౌస్ హోల్డ్ సర్వే, ఈ కేవైసీ, ఎంఎస్ఎంఈ, నాన్ రెసిడెన్షియల్ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌డీవో ఆదేశించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు తప్పనిసరిగా ప్రతి సోమ, గురువారాలలో పాఠశాలల మరుగుదొడ్లను పరిశీలించాలని చెప్పారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రతి రోజు నియమిత సమయంలో బయోమెట్రిక్ వేయాలని ఆమె చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని ఆరేళ్లలోపు చిన్నారులలో ఆధార్ కార్డులు లేని వారిని గుర్తించి వారికి ఆధార్ నమోదు చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా కో ఆర్డినేటర్ యశ్వంత్, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తెనాలిలో పునఃప్రారంభం అయిన ప్రత్యేక సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వినికిడి, దృష్టి లోపం కలిగిన వికలాంగుల ధృవపత్రాల పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. గత బుధవారం నుంచి మూడు రోజుల పాటు దీనిని నిర్వహించిన విషయం తెలిసేందే. ఈవారం కూడా క్యాంప్‌ను నిర్వహించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సదరం క్యాంప్‌ను అధికారులు నిర్వహించారు. క్యాంప్ వద్ద వికలాంగులకు కూర్చునేందుకు అవసరమైన టెంట్లు, కుర్చీలు, మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. కానీ అక్కడ త్రాగేందుకు గ్లాసులు ఏర్పాటు చేయకపోవటంతో వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. ఈఎన్‌టీ విభాగంలో 53 మందిని, అప్తామాలజీ విభాగంలో 80 మంది వికలాంగులకు వైద్య పరీక్షలు చేశారు. క్యాంప్‌లో నర్సారావుపేట ప్రభుత్వ వైద్యశాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఎం చంద్రబాబు, సత్తెనపల్లి నుంచి వచ్చిన డాక్టర్ మాధురిలు, బాపట్ల నుంచి వచ్చిన అప్తామాలజీ వైద్యులు డాక్టర్ ఆషాకిరణ్, నరసరావుపేట నుంచి వచ్చిన డాక్టర్ ఎన్.హేమశ్రీలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య వాణి క్యాంప్‌ను పర్యవేక్షించారు. గురు, శుక్రవారాలలో కూడ శిబిరం కొనసాతుందని ఆమె చెప్పారు.

పట్టపగలు మూడు ఇళ్లలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

గుంటూరు రూరల్: పట్టపగలు ఇంటి తలుపులు, బీరువా తాళాలు పగలగొట్టి మూడు ఇళ్లలో చోరీ చేసిన ఘటన మండలంలోని వెంగళాయపాలెంలో చోటుచేసుకుంది. బాధితులు, నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. గ్రామంలోని లక్ష్మీనరసింహపురం కాలనీలో వరసగా ఉన్న ఇళ్లు లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయారు. వి.అనిల్‌కుమార్ భార్య బిడ్డలతో కలిసి ఒక ఇంట్లో నివసిస్తూ మిర్చి యార్డులో కూలీ పనులు చేసుకుంటూ ఉంటాడు. అనిల్ పనికి వెళ్లగా భార్య అతనితో పాటే పిల్లలను స్కూలుకు పంపి కూలీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం తీసి బీరువాలోని బట్టలు వస్తువులు చిందరవందరగా పడేసి ఉండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఇంటి బీరువాలోని బంగారు నాన్‌తాడు, నగదు రూ.50 వేల వరకూ, వెండి వస్తువులు అపహరించారని బాధితుడు వాపోయాడు. పక్కనే ఉండే పాలపర్తి నాగరాజు కూలీ పనులు చేసుకుంటుండగా భార్య నగరంలోని డీమార్ట్‌లో పనిచేస్తోంది. అతడి ఇంట్లో రూ.55 వేలు, బంగారు వస్తువులు అపహరించారు. అదే విధంగా పక్కనే ఉన్న పీ వెంకటనాగరాజు స్థానిక ప్రైవేటు పాఠశాలలో రోజువారీ కూలీగా పనిచేస్తుంటాడు. అతడి ఇంట్లో రూ.60 వేలు, బంగారు వస్తువులు అపహరించారని వాపోయాడు. మూడు ఇళ్లతోపాటు ఖాళీగా ఉన్న మరో ఇంటి తాళాలు పగలగొట్టి ఇల్లు ఖాళీగా ఉండటంతో దుండగులు వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న నల్లపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. బాధితుల ఫిర్యాదు, స్థానికంగా ఉన్న సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

విద్యతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనాలి

ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్



పిచ్చిచెట్లను తొలగిస్తున్న ఏబీఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రేపల్లె రూరల్: విద్యార్థులు విద్యతో పాటు సేవా కార్యక్రమాల్లోను చురుకుగా పాల్గొనాలని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్రకుమార్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. సేవా కార్యక్రమాలలో పాల్గొనే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు సహకార భావం ఏర్పడుతుందన్నారు. అంతేకాకుండా పని విలువ తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.దాసు, కళాశాల వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ ఎం.బుజ్జి, ఎన్‌సీసీ ఆఫీసర్ బాలగురవయ్య, అధ్యాపకుడు బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి



సీపీఎం రాష్ట్ర మహాసభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

భట్టిప్రోలు (కొల్లూరు) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న సీపీఎం 27వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్ కోరారు. బుధవారం స్థానిక రథం సెంటర్‌లో మహాసభ పోస్టర్లను స్థానిక నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు నెల్లూరులో జరగనున్న రాష్ట్ర మహాసభలలో ప్రజా పోరాటాలపై ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చే విధంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రజా ఉద్యమాల కోసం జరుగుతున్న మహాసభలకు ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ల నాగరాజు, పి.మనోజ్‌కుమార్, బట్టు నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు, గుంటూరు దానియేలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ వేమూరు, పెనమత్రు గ్రామ అధ్యక్షుల ఏకగ్రీవ ఎన్నిక



గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన సురేష్‌ను సత్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి

వేమూరు (కొల్లూరు): గ్రామ కమిటీలను బలోపేతం చేయడంలో భాగంగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన నూతన గ్రామ కమిటీల ఎంపిక ప్రక్రియ వేమూరు, పెనమత్రు గ్రామాలలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమక్షంలో నిర్వహించిన గ్రామ కమిటీల ఎంపికలో వేమూరు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా గుమ్మడి సురేష్, పెనమత్రు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా కర్లపూడి ఆనంద బాబులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పగించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుకు, గ్రామ క్రియాశీలక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ పదవికి న్యాయం చేస్తూ పార్టీ అభివృద్ధికి పాటుపడతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరికూటి ఇరువురు గ్రామ పార్టీ అధ్యక్షులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వేమూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దాది సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, నాయకులు దున్నా మేరీసుబాబు, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఈ శ్రమ్ కార్డులు కలిగి ఉండాలి

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రభాకరరావు

రేపల్లె రూరల్: ఈ శ్రమ్ కార్డుల ద్వారా కార్మికులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధిని పొందవచ్చని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జీ ప్రభాకరరావు తెలిపారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. కార్మిక శాఖ పరిధిలోని ఏడు మండలాల్లో షాపులు, హోటళ్లు, పెట్రోలు బంకుల్లో ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద పనిచేస్తున్న కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, వివిధ సంస్థల్లో పనిచేసే కార్మికులందరూ తప్పనిసరిగా ఈ శ్రమ్ కార్డులను పొందాలన్నారు. కార్డులకై కార్మికులు అన్ని వేళలా ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లతో లేబర్ ఆఫీసులో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉచితంగా దరఖాస్తు చేసుకుని కార్డులు పొందాలని సూచించారు. అదే విధంగా 17 సంవత్సరాలలోపు చిన్నారులతో దుకాణాలలోగానీ, ఇతర సంస్థల యజమానులుగానీ పనులు చేయిస్తే సంస్థ యజమానులపై బాల కార్మిక చట్టం ప్రకారం లక్ష రూపాయల జరిమానాతో పాటు సంవత్సరం జైలు శిక్ష విధించబడునని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి



మాలతి (ఫైల్)

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువతులు తీవ్రంగా గాయపడగా, ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. పట్టణ నాజరుపేటకు చెందిన రమ్య, మల్లెపాడుకు చెందిన చిలుమూరి మాలతి (22) గుంటూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ప్రతి రోజు ఆక్టివాపై వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీ రాత్రి విధులు ముగించుకుని తిరిగి వస్తుండగా తెనాలి మండలం సంగం జాగర్లమూడి, అంగలకుదురు గ్రామాల మధ్య ఎదురుగా పల్సర్ బైక్‌పై వచ్చిన చేబ్రోలు మండలం శలపాడుకు చెందిన వ్యక్తి వీరి వాహనాన్ని వేగంగా ఢీకొట్టాడు. ఘటనలో ఇద్దరు యువతులు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను వడ్లమూడి సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, అక్కడ నుండి తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. మాలతి పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు సమగ్ర వైద్యశాలకు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. పోస్ట్‌మార్టమ్ అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించగా, సాయంతరం మల్లెపాడులో అంత్యక్రియలు నిర్వహించారు.

ఫిబ్రవరి 3 నుంచి అమరలింగేశ్వరుని ప్రతిష్టా మహోత్సవాలు

రేపల్లె రూరల్: మండలంలోని కారుమూరు గ్రామంలో పునఃనిర్మించిన లలితా పరబ్రహ్మేశ్వరి సమేత అమరలింగేశ్వరస్వామి వార్ల ప్రతిష్ఠా మహాకుంభాభిషేక మహోత్సవాలు ఫిబ్రవరి 3 నుంచి 7వ తేది వరకు నిర్వహించబడునని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 6వ తేదీ వరకు నూతన ఆలయంలో ప్రత్యేక హోమాది పూజలు నిర్వహించి, 7వ తేదీన ఉదయం 11.26 గంటలకు స్వామి, అమ్మవార్ల విగ్రహాలు ప్రతిష్ఠించబడునని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రేపు మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో 31వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఫిబ్రవరి 4న మండల పరిషత్ సమావేశం

కొల్లూరు : కొల్లూరు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం వచ్చే నెల 4న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.నరసింహారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు శాఖాపరమైన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

గ్యాస్ట్రిక్ సమస్యతో వ్యక్తి మృతి

రేపల్లె రూరల్: గ్యాస్ట్రిక్ సమస్యతో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని 5వ వార్డులో చోటు చేసుకుంది. సీఐ మల్లికార్జునరావు వివరాల మేరకు 5వ వార్డుకు చెందిన నలిగల మహేష్ (40) బాపట్ల కోఆపరేటివ్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడన్నారు. మహేష్‌కు నిజామాబాద్‌కు చెందిన సాహితితో వివాహమైందని, ఆమె పుట్టింటికి వెళ్లిందన్నారు. గ్యాస్ట్రిక్ సమస్య ఎక్కువైందని, చెస్ట్‌లో నొప్పిగా ఉందని మంగళవారం అర్ధరాత్రి మహేష్ తన భార్యకు ఫోన్ చేసి చెప్పాడన్నారు. దీంతో సాహితి బంధువులకు తెలియజేసిందని, మహేష్‌ను బంధువులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. మృతుని భార్య సాహితి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అవినీతికి తావులేకుండా ఉపాధి పనులు నిర్వహించాలి

ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి

నిజాంపట్నం: అవినీతికి తావులేకుండా ఉపాధి హామీ పథకం పనులు నిర్వహించాలని ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌లకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పథకం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవటంతో పాటు కూలీలకు గ్రామంలోనే ఉపాధి కల్పించవచ్చన్నారు. గ్రామాలలో అవసరమైన పనులు ఇప్పటికే ఎంపిక చేసి తీర్మానించటం జరిగిందని, అవకతవకలు లేకుండా పనులు పూర్తి చేయాలని చెప్పారు. పలు అంశాలపై సమీక్షించారు. టెక్నికల్ అసిస్టెంట్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుగ్గిరాల, చిలువూరు స్టేషన్ల మధ్య మంచికలపూడి రైల్వే గేటు సమీపంలో సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు తెనాలి క్రీడాకారులు

తెనాలిఅర్బన్: జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్‌కు చెందిన జనార్దన్ రెడ్డి, కల్యాణ్‌లు ఎంపికైనట్లు కోచ్ నాగరాజు బుధవారం తెలిపారు. ఉత్తరాఖండ్‌లో జరనున్న జాతీయ పోటీలలో వీరు పాల్గొంటారని చెప్పారు. వీరిని డబుల్ హార్స్ ఫౌండేషన్ నిర్వాహకులు, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర రావులు అభినందించారు.

జూదరుల అరెస్ట్

కొల్లిపర: మండల పరిధిలోని పాతబొమ్మువానిపాలెం గ్రామంలో బుధవారం పంట పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు కొల్లిపర ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి 6810, నాలుగు బైకులు సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుల్ కూర్మారావు, అశోక్ ఉన్నారు.